భావితరాల బంగారు భవిత కోసం..



'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు



సమావేశానికి హాజరైన ప్రజలు

- స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారమయ్యేందుకు..
- మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: భావితరాల బంగారు భవిష్యత్తు కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం, పేదలకు మెరుగైన వైద్యం అందించడం కోసం అహర్నిశలు శ్రమిస్తూ.. పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలుద్దామన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని పెదగంట్యాడ మండలంలోని యారాడ సచివాలయంలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత మనం సీఎంకే దక్కుతుందన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు వారికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

ప్రతీ కుటుంబానికీ అండగా..

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనతో పాటు అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి విద్యార్థుల చదువుకు బాసటగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు, పేదల చెంతకే వైద్య సేవలు అందిస్తున్నారని తెలియజేశారు. చేయూత, ఆసరా తదితర ఎన్నో పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి అడుగడుగునా అండగా నిలుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన సంక్షేమ పథకాలు.. ప్రజలకు చేకూర్చిన లబ్ధి గురించి వివరించాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లపై ఉందన్నారు. ఏ ఒక్క ఇంటినీ వదలకుండా.. లబ్ధి పొందిన వారందరినీ కలసి, వారికి అందిన లబ్ధిని తెలియజేయాలన్నారు. అర్హత ఉన్నా ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలు సేకరించి, వారికి కూడా లబ్ధి చేకూర్చాలని కోరారు. సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. యారాడ సచివాలయ పరిధిలో రూ.18 కోట్లతో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏపీడీ రాము, క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, నాయకులు నాగోతి మధు, అప్పారావు, బంకా రాము, బంకా వాసు, వెంకట అప్పారావు, గుజ్జారి లలిత, నాగోతి పార్వతి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అవినీతి అంతం అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

అగనంపూడి: అందరి సహకారంతోనే అవినీతి రహిత సమాజం సాధ్యమవుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. నిఘా వారోత్సవాల సందర్భంగా అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవినీతిని నిరోధించడంలో ప్రజలు సహకారం అవసరమన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా పాటుపడాలని కోరారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే 14400 కాల్ సెంటర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తరువాత ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర డీసీపీ–2 కె.ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సైఫెస్టా - 2కె23' ప్రారంభం

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో సైఫెస్టా – 2కె23 ఉత్సవాలు ప్రారంభమయ్యా యి. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ సైన్స్ ఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులలో వినూత్నమైన ఆలోచనలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సైఫెస్టా–2కె23 ఉద్దేశాన్ని ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పి.వి.డి.సౌజన్య కుమారి ఈ సందర్భంగా వివరించారు. ఈ ఫెస్ట్‌లో నగరానికి చెందిన 15 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి సత్యవతికి నివాళి



మంత్రి సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఇంటక్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు మంత్రి శంకరనారాయణ మాతృమూర్తి మంత్రి సత్యవతి సంతాప సభను గురువారం నడుపూరులోని ఆమె స్వగృహంలో నిర్వహించారు. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, కార్మిక సంఘాల నాయకులు సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

20న శక్తికేంద్ర ప్రముఖ్‌ల సమావేశం

గాజువాక: ఈ నెల 20న బీజేపీ శక్తికేంద్ర ప్రముఖ్‌లతో నిర్వహించనున్న సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ గాజువాక మండల ఇన్‌చార్జి కె.విజయబాబు కోరారు. 70వ వార్డులో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరవుతారని, ఈ నేపథ్యంలో ప్రతీ కార్యకర్త ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీనివాస్, డి.పావని, రోహిణి, వర్రి లలిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న హెచ్‌పీసీఎల్ క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు

పెదగంట్యాడ: విద్యారంగం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని హెచ్‌పీసీఎల్ క్వాలిటీ కంట్రోల్ సీనియర్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. ప్రపంచ క్వాలిటీ వారోత్సవాలను యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.తేజేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎస్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయుడు సరోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 'స్మార్ట్ షూ డిజైన్' పేటెంట్

అగనంపూడి: యునైటెడ్ కింగ్‌డమ్ రూపొందించిన స్మార్ట్ షూ డిజైన్ పేటెంట్‌ను దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ దక్షిణమూర్తికి మంజూరు చేసింది. ఈ మేరకు ఆ పేటెంట్ హక్కు పత్రాన్ని కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల సీఈఓ శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ స్మార్ట్ షూ డిజైన్ వృద్ధులకు, అనారోగ్యంతో బాధపడే వారికి, కదలికలు లేకుండా ఇబ్బంది పడేవారికి, కాళ్లలో సత్తువ లేని వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కోలుకోలేని పరిస్థితిలో కూడా నడవడానికి వీలుగా మైక్రో కంట్రోలర్ డేటాను ప్రాసెస్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక డిపోలో నేడు డయల్ యువర్ డీఎం

మల్కాపురం : గాజువాక ఆర్టీసీ డిపో ఆవరణలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. ఆర్టీసీ కల్పిస్తున్న సౌకర్యాలు, లోపాలు ఇతర సమస్యలేమైనా డయల్ యువర్ డీఎం 9959225501, 7382913422 నంబర్‌కు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ వి.ప్రవీణ తెలిపారు.

సామాజిక సాధికార యాత్రకు ర్యాలీగా..



లంకెలపాలెం కూడలి నుంచి అనకాపల్లి వైపు ర్యాలీగా వెళ్తున్న నాయకులు

అగనంపూడి: అనకాపల్లిలో నిర్వహించిన సామాజిక సాధికారిక యాత్రలో పాల్గొనేందుకు లంకెలపాలెం, ఫార్మాసిటీ కాలనీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు గొన్నా హేమచంద్ నాయుడు ఆధ్వర్యంలో వంద బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా లంకెలపాలెం మీదుగా అనకాపల్లి వెళ్తున్న మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ నేటి సామాజిక సాధికార యాత్ర వచ్చే సాధారణ ఎన్నికల విజయ యాత్రగా మారనుందన్నారు. యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ పైప్‌లైన్ ఏర్పాటుకు భూమి పూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: శ్రీనగర్ దరి శివసాయినగర్‌లో వాటర్ పైప్‌లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావుతో కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.14.5 లక్షలతో ఈ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోను మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కొండవాలు ప్రాంతాల్లో సైతం నీటి సమస్యకు ఇబ్బంది లేని విధంగా చర్యలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో వాటర్ సప్లై డీఈ మాధవరావు, ఏఈ కేదార్‌నాథ్, సచివాలయ సిబ్బంది, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు' నష్టాలకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత



దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కుట్రపూరితంగా నష్టాల్లోకి నెట్టారని, ప్రైవేటీకరణలో భాగంగానే ఇదంతా చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నష్టాలకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1001వ రోజు, గురువారం సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షలోపాల్గొన్న పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా భారతీయులు ఆర్థికంగా ఇంకా వెనుకబడే ఉన్నారని, ఈ పరిస్థితుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వారికి అమ్మాలని చూడడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్దామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన ఉక్కు 1000 రోజులు దీక్షలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకలు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలని నిర్వాసితుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గంగవరం పోర్టు వంతెన వద్ద గల గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఉద్యమాలు చేసినా కేంద్ర ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు. కేంద్రప్రభుత్వం దిగి వచ్చి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. నిర్వాసిత కాలనీలు పెదగంట్యాడ, గంగవరం, వడ్లపూడి, అగనంపూడి నుంచి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్ కార్డుదారులకు శాశ్వత ఉపాధి కల్పించే వరకూ పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, మంత్రి గోపీనారాయణ, శ్రీను, కణితి అప్పలరాజు, నమ్మి రమణ, అప్పారావు, మొల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మిక నిలయాలు



ధ్వజస్తంభాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: దేవాలయాలు ఆధ్యాత్మిక నిలయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు సీతారామాలయ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఇక్కడ ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, గొందేశి సత్యారావు, తిరుమలరెడ్డి, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



ప్రతినిధులకు విరాళం అందిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నిర్మిస్తున్న శ్రీ దుర్గమాంబ, కుంచమాంబ ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఆ నగదును టీడీపీ నాయకుల చేతుల మీదుగా ఆలయ కమిటీ ప్రతినిధులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం



భెల్ గుర్తింపు కార్యాలయంలో ఉద్యోగులకు నేరాలపై అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్‌ఐ రమణారెడ్డి

అక్కిరెడ్డిపాలెం: నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గాజువాక క్రైం ఎస్‌ఐ రమణారెడ్డి సూచించారు. భెల్ టౌన్‌షిప్‌లో నివాసాలు, రహదారులన్నీ చెట్లతో కవర్ అయి ఉండడం వల్ల నేరాలు జరిగే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భెల్ గుర్తింపు కార్యాలయంలో ఉద్యోగులకు గురువారం సాయంత్రం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. నివాసాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. అలా అమర్చుకోవడం వల్ల నివాసాల్లో పరిస్థితిని తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్ల ద్వారా ప్రతీక్షణం తెలుసుకోవచ్చన్నారు. ఊళ్లకు వెళ్లేటప్పుడు నివాసాల్లో ఎక్కువ మొత్తంలో బంగారం, నగదు ఇంట్లో పెట్టి వెళ్లరాదని సూచించారు. ఊరు వెళ్లే ముందు పోలీసులకు తెలియజేయాలన్నారు. సెల్ ఫోన్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున వాటిని ఎలా జాగ్రత్తగా కాపాడుకోవాలో సూచించారు. ద్విచక్రవాహనాలకు జాగ్రత్తగా తాళాలు వేయాలన్నారు. కార్యక్రమంలో క్రైం హెడ్ కానిస్టేబుల్ వరహాలు, సిబ్బంది లక్ష్మణ్, గుర్తింపు యూనియన్ ఉప గౌరవ అధ్యక్షుడు కొల్లి దేముడు, అధ్యక్షుడు బొండా బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే రైల్వే భద్రత



సెమినార్‌లో మాట్లాడుతున్న కె.సి.జేమ్స్

కంచరపాలెం: రైల్వే భద్రత అంశాలపై ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సి.జేమ్స్ మాట్లాడుతూ ఇటీవల కేపీఎల్–ఏఎల్ఎం సెక్షన్ మధ్య పలాస–రాయగడ ప్యాసింజర్‌లు ఢీకొన్న సంఘటన అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ విషాద ఘటన తర్వాత రైల్వేలో భద్రత అనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన రైల్వే ఉద్యోగులతో పాటు ప్రయాణికులకు సంతాపాన్ని తెలియజేశారు. ప్రమాదానికి గల కారణాలేమిటో కాకుండా.. ఎవరు బాధ్యులన్న ఉద్దేశంతో రైల్వే అధికారులు ప్రమాదాలపై ఆరా తీస్తున్నారన్నారు. జోనల్ అధ్యక్షుడు ఎస్.కె.చౌబే, కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ సేఫ్టీ కేటగిరీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వే యంత్రాంగం, ప్రభుత్వం వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కుమార్, జగన్, పబ్లిక్ సెక్టార్ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల కన్వీనర్ రెడ్డి వెంకటరావు, ఏఐఎల్ఆర్ఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వి.ఎస్.రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్నోడు, పాణిగ్రాహి, హరికృష్ణ, సంతోష్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతిపై సదస్సు నేడు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏయూ అలుమ్ని హాలులో 'ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి–విశాఖపట్నం జిల్లా ప్రగతి'అనే అంశంపై సదస్సు జరగనుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

రమాదేవికి ఐఎస్ఏ జెండర్ డైవర్సిటీ అవార్డు



రమాదేవిని అభినందిస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రొడక్షన్ ప్లానింగ్ అండ్ మానిటరింగ్ (పీపీఎం), కాస్ట్ అండ్ టోటల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీటీక్యూఎం) జీఎం డాక్టర్ జి.రమాదేవికి ఇండియన్ స్టీల్ అసోసియేషన్ (ఐఎస్ఏ)అందించే జెండర్ డైవర్సిటీ ఐకాన్ అవార్డు లభించింది. ఐఎస్ఏ ఆధ్వర్యంలో దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉక్కు కంపెనీలకు చెందిన కొంతమంది వ్యక్తులను గుర్తించి, ఏటా ఈ అవార్డులను అందజేస్తుంటారు. నవంబర్ 7న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. అదే కార్యక్రమంలో ఆమెకు వింగ్స్ ఆఫ్ స్టీల్ అవార్డు కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే అభినందించారు.

డిసెంబర్‌లో కోటి ఒత్తుల దీపోత్సవాలు

సింహాచలం: విరాట్ హిందూ సంఘ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో సింహాచలంలో కోటి ఒత్తుల దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్టు విశాఖకు చెందిన హిమాలయ సార్వ పీఠాధిపతి ప్రభాకర్ యోగి తెలిపారు. సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద కార్యక్రమాల వివరాల కరపత్రాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌యోగి మాట్లాడుతూ సర్వజనులు సుఖశాంతులతో ఉండాలన్నా...ఆనందంతో జీవించాలన్నా సనాతన ధర్మం ఒక్కటే మార్గమని తెలిపారు. సనాతన భారతీయ ధర్మాన్ని రక్షించుకునే క్రమంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద, హవేలీ గ్రౌండ్‌వద్ద, వరాహ పుష్కరిణి వద్ద కోటి ఒత్తుల దీపోత్సవ మహోత్సవాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. డిసెంబర్ 8న నగరంలోని జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం నుంచి సింహాచలంలోని తొలిపావంచా వరకు భారీ ఎత్తున భారీకలశ యాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విరాట్ హిందూ సంఘ్ ప్రతినిధిలు మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ, నమ్మి రాజగోపాల్, భీశెట్టి నాగభూషణం, కాళ్ల జగన్‌మోహన్, ఆర్.జయరాజ్, బూరాడ సాయి రోజా, జ్యోతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సార్వ పీఠాధిపతి ప్రభాకర్ యోగి

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఘనంగా స్వర్ణ తులసీదళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవీలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. స్వర్ణ తులసీ దళాలతో ఉభయదాతలచే ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ చేస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

విశేషంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సింహగిరిపై ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్ట్ కేంద్రం



ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు కేంద్రాన్ని గురువారం సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం నుంచి మైకు ద్వారా వాహనాల నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాలు, తదితర అంశాలను భక్తులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.